క్లుప్తంగా

నవంబర్ 1న దీపావళి

పరకాల : నవంబర్ 1న దీపావళి పర్వదినం వేడుకలను ప్రజలంతా కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని పరకాల మండల కామారెడ్డి పల్లి ప్రముఖ శ్రీమల్లికార్జునస్వామి దేవస్థానం అర్చకుడు దూగం రాజేశ్వరశర్మ కోరారు. ఈనెల 31వ తేదీన గురువారం నరకచతుర్దిశి (హారతీ), నవంబర్ 1న శుక్రవారం దీపావళి, శ్రీకేదారేశ్వస్వామి వ్రతం(నోములు) జరుపుకోవాలని సూచించారు.

శ్రీరాముడి దర్శనానికి రుసుము తీసుకోవద్దు

ఆత్మకూరు : భద్రాచలంలోని శ్రీరాముడి దర్శనానికి రుసుము తీసుకోవద్దని, అందరికీ ఒకే విధమైన దర్శనం కల్పించాలని అఖిల భారత హనుమాన్ ప్రచారకుడు గాదెపాక రాములుస్వామి కోరారు. మండల కేంద్రంలోని పలు ఆలయాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రాచలంలో గోదావరి కరకట్ట ఎత్తు పెంచి 60 సంవత్సరాలు దాటినా భక్తులకు లిఫ్ట్ సౌకర్యం కల్పించలేదని అన్నారు. దళిత పూజారులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రేవూరి జైపాల్‌రెడ్డి, కట్కూరి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనలో పాల్గొన్న నాయకులు



శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ శివారులో గల వాహెద్ నగర్ దర్గా షరీఫ్‌ను పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా జెండా పండుగలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు మారెపల్లి కట్టయ్య, నిమ్మల రమేశ్, భిక్షపతి, విష్ణు, నాగరాజు పాల్గొన్నారు.

ఉద్యమ ఫోరం మండల అధ్యక్షుడిగా సంపత్



కమలాపూర్ : తెలంగాణ ఉద్యమ కమిటీ ఫోరం కమలాపూర్ మండల అధ్యక్షుడిగా మొటం సంపత్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కనకం కుమారస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంపత్‌కు నియామకపత్రం అందించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో జేఏసీ నాయకుడిగా చురుకైన పాత్ర పోషించినందుకు సంపత్‌కు ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి, రాష్ట్ర కో కన్వీనర్ ప్రసాద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



నడికూడ : రోడ్డు విస్తరణ పనుల కారణంగా మండల కేంద్రంలోని 9వ వార్డులో గ్రామపంచాయతీ నల్లా పైప్‌లైన్ మరమ్మతుకు చేరుకున్న విషయం తెలిసిందే. కాగా శుక్రవారం సీడీఎఫ్ నిధులు మంజూరు కాగా సంబంధిత సిబ్బంది నూతన పైప్‌లైన్ పనులు ప్రారంభించారు. దీంతో ఆ వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ స్పెషల్ ఆఫీసర్ చేతన్‌కుమార్ రెడ్డి, కార్యదర్శి సందీప్, మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు, మాజీ ఉపసర్పంచ్ మణి, మాజీ 9వ వార్డు సభ్యుడు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

ఖిలా వరంగల్: ప్రభుత్వ డిగ్రీ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి.రాజన్న కోరారు. ఈ మేరకు వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సూచించారు. అతిథి అధ్యాపకులు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టులాడుతున్నారని అన్నారు. ప్రతినెలా వేతనాలు అందజేస్తే అతిథి అధ్యాపకుల ఆర్థిక ఇబ్బందులు కొంతవరకు తొలగిపోతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం దృష్టి సారించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎండీ.షరీఫ్‌పాషా, కోశాధికారి గీత, షమీనా పాల్గొన్నారు.

ప్రమాదాలకు కేరాఫ్ రోడ్డుడ్యాం

- పేరుకుపోయిన పాకురు
- గాయాలపాలవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ప్రమాదకరంగా ఉన్న నడికూడ-గొల్లపల్లి గ్రామాల మధ్య రోడ్డుడ్యాం

నడికూడ : చూడడానికి చిన్న రోడ్డుడ్యామే కానీ నిత్యం ప్రమాదాలకు కేరాఫ్‌గా మారుతోంది. నడికూడ-గొల్లపల్లి మధ్యగల రోడ్డుడ్యాంపై వెంకటయ్యచెరువు నీరు నిత్యం పారడంతో పాకురు పేరుకుపోయి జారుడుబండలా మారింది. దీంతో నడిచే వెళ్లినా, ద్విచక్ర వాహనాలపై వెళ్లినా ప్రమాదాలు తప్పడం లేదని పలువురు ఆగ్రహిస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఆదమరి వ్యవహరిస్తే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. గొల్లపల్లి రోడ్డుడ్యాం అంటేనే ప్రయాణికులు జంకుతున్నారని అంటున్నారు. మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వరంగల్, హనుమకొండకు వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి అవడంతో నిత్యం వందల కొద్ది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో రోడ్డుడ్యాం వద్ద రోజుకో ప్రమాదం తప్పడం లేదని స్థానికులు తెలిపారు. అధికారులకు, పాలకులకు తెలిపినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ప్రతిపాదనలు రద్దు ..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ 2.కోట్ల70 లక్షల వ్యయంతో రోడ్డుడ్యాంపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించింది. కానీ ఇటీవల ఆ ప్రతిపాదనలు రద్దు అయినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. రోడ్డుడ్యాంపై పాకురు పేరుకుపోకుండా తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రయాణించాలంటే భయమేస్తోంది



రోడ్డుడ్యాంపై నిత్యం నీరు ప్రవహిస్తుండడంతో పాకురు పేరుకుంది. దీంతో గొల్లపల్లి-నడికూడ మధ్య ప్రయాణించాలంటే భయమేస్తోంది. మండల కేంద్రానికి వివిధ పనుల కోసం ఈ రోడ్డుడ్యాం నుంచే వెళ్లాలి. పాకురు ఉండడంతో వాహనాల టైర్లు జారి ప్రమాదాలు జరుగుతున్నాయి.

- జి. అరవింద్, స్థానికుడు

వంతెన నిర్మించాలి



నడికూడ-గొల్లపల్లి మధ్య గల రోడ్డుడ్యాం సమస్య గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కానీ ఇప్పటి వరకు స్పందన లేదు. ద్విచక్ర వాహనదారులతో పాటు కాలినడకన వెళ్లేవారు కూడా పాకురుకు జారి కిందపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి హైలెవల్ వంతెన నిర్మించాలి.

- తాళ్ల శ్యామ్, రైతు, నడికూడ

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కేస్ వర్కర్ వినీల

కేస్ వర్కర్ వినీల

శాయంపేట : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ వినీల సూచించారు. మాందారిపేట శివారులో గల కస్తూర్బా గాంధీ పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ మాధవి అధ్యక్షతన సఖి వన్ స్టాప్ సెంటర్, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా, శిశు సంక్షేమ, దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో సఖి సెంటర్ కొనసాగుతుందన్నారు. బాధితులకు కౌన్సెలింగ్, వైద్య, పోలీస్, న్యాయ సహాయం, తాత్కాలిక వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. మహిళలు గృహహింస, లైగింక వేధింపులు, అత్యాచారాల నుంచి రక్షణ పొందాలని అన్నారు. సఖి సెంటర్ 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. బాధిత మహిళలు 181 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా 08702452112, 7382983088 కు ఫోన్ చేసి సహాయం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇంద్ర, చైతన్య, భానుశ్రీ, శృతి, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖకు విద్యార్థినుల కృతజ్ఞతలు



వరంగల్: మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు జన్మదినం సందర్భంగా ఆంధ్ర బాలికల పాఠశాల విద్యార్థినులకు కాంగ్రెస్ నాయకుడు మడిపల్లి కృష్ణ గౌడ్ సైకిళ్లను అందించారు. ఈమేరకు లబ్ధిపొందిన విద్యార్థినులు మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఓసిటీలోని క్యాంపు కార్యాలయానికి వచ్చి మంత్రికి శుక్రవారం స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి మంత్రి సురేఖ సైకిల్ తొక్కి సందడి చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో వినతులు స్వీకరించారు. అనంతరం తను మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తన కాన్వాయ్‌కు పైలట్‌గా వ్యవహరించిన మహిళా ఏఎస్సై పదవీవిరమణ చేయగా మట్వాడ పోలీస్ సిబ్బందితో కలిసి ఆమెను మంత్రి సత్కరించారు.

కేయూ వీసీకి సన్మానం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డిని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మానవ తారాయ్, కన్వీనర్ మేడారపు సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి నరేష్, బాధ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించారు. కేయూ నిరుద్యోగ జేఏసీ ఇన్‌చార్జ్ అభిరామ్, కేయూ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు గుండేటి సుమన్, బాధ్యులు నాగరాజు, దుర్గం వినోద్, హేమంత్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రామన్నపేట: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద మీసేవా కేంద్రం పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు మట్టెవాడ సీఐ తుమ్మ గోపి ఒక ప్రకటనలో తెలిపారు. మృతుడు సుమారు 50 ఏళ్ల వయస్సు ఉండి, ఆరంజ్ రంగు టీషర్ట్, బూడిద రంగు నైట్ పాయింట్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిస్తే 87126 85005, 87126 85117 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

సౌండ్ సిస్టమ్ బహూకరణ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ఎల్లాపురం జిల్లా పరిషత్ పాఠశాలకు సౌండ్ సిస్టాన్ని బహూకరించారు. గ్రామానికి చెందిన గంగిళ్ల మధుసూదన్‌రెడ్డి, గోలి వెంకటరంగారెడ్డి కలిసి సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎర్ర ప్రకాష్, సునీల్, బాషబోయిన రాజన్‌బాబు, భిక్షపతి పాల్గొన్నారు.

నిబంధనల మేరకే మొరం తరలింపు



మొరం తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

దామెర : నిబంధనల మేరకే మొరం తరలిస్తున్నట్లు తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని పెద్దగుట్ట సమీపంలో జాతీయ రహదారి కోసం మొరం తవ్వకాలు చేస్తున్న ప్రాంతాన్ని మైనింగ్ అధికారులతో కలిసి శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జాతీయ రహదారి కోసం అధికారులు సూచించిన ప్రదేశంలోనే నిబంధనలకు లోబడి తవ్వకాలు చేపడుతున్నట్లు చెప్పారు. తవ్వకాలతో ఏర్పడిన గుంతలను కూడా సంబంధికులు పూడ్చివేయాలని ఆదేశించారు. తనిఖీల్లో మైనింగ్ ఆర్ఐ చంద్రకళ, ఆర్ఐ సంపత్, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్షప్యాడ్ల పంపిణీ



కస్తూర్బాలో విద్యార్థినులకు పరీక్షప్యాడ్లు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకుడు జగదీశ్వర్

ఎల్కతుర్తి : హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని వివిధ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు పరీక్షప్యాడ్లు పంపిణీ చేశారు. కస్తూర్బాగాంధీ పాఠశాలలో, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్షప్యాడ్లు, పెన్నులను ట్రస్ట్ నిర్వాహకుడు గండిశెట్టి జగదీశ్వర్ పంపిణీ చేశారు. రిటైర్డ్ టీచర్ గంగిశెట్టి దయాకర్ జ్ఞాపకార్థం 190 మందికి పరీక్షప్యాడ్లు అందించినట్లు చెప్పారు. పదోతరగతి చదివే విద్యార్థులు కష్టపడి చదివి వార్షిక పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించాలని కోరారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ఎమ్మార్సీ’ప్రారంభం

నడికూడ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం ఎంఈఓ కున్సోతు హనుమంతరావు, ఎంపీడీఓ శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మార్సీ కార్యాలయాన్ని ప్రారంభించారు. మండల పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎమ్మార్సీ ప్రారంభిస్తున్న అధికారులు

పొట్టకూటికి వచ్చి తిరిగిరాని లోకాలకు

- వీరాంజనేయ క్వారీలో బిహార్ వాసి మృతి



సుబోద్ యాదవ్ (ఫైల్)

ఐనవోలు : పొట్టకూటి కోసం రాష్ట్రాన్ని దాటి వచ్చిన వలస జీవి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని వనమాల కనపర్తి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. వనమాల కనపర్తి గ్రామంలోని వీరాంజనేయ క్వారీలో బిహార్ రాష్ట్రానికి చెందిన సుబోద్ యాదవ్ (36) మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగా శుక్రవారం క్వారీలో స్టోన్ కటింగ్ చేస్తుండగా కాలు జారి పైనుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో ఎడమ చెయ్యితో పాటు ఇతర భాగాల్లో బలమైన గాయాలయ్యాయి. అక్కడి సిబ్బంది వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో సబోద్ యాదవ్ మృతిచెందాడు. మృతుడి అన్న రాజేందర్ కుమార్ యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. కాగా అనుమతులు లేని జెలిటిన్ స్టిక్స్(పేలుడు పదార్థం) ఉపయోగించి క్వారీలో బ్లాస్టింగ్ చేస్తున్న క్రమంలో కొద్దిదూరంలో పనిచేస్తున్న సుబోద్ యాదవ్ చేయి తెగి విపరీతంగా రక్తస్రావం అయినట్లు తెలిసింది. మృతుడు బిహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి కావడంతో అక్కడ పనిచేస్తున్నవారు ఎవరు నోరు మెదపడం లేదనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అనుమతులు లేకుండా క్వారీల్లో బ్లాస్టింగ్ జరుపడం వలన అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని, అధికారులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సిద్ధయ్యకు పద్మశాలీల ఆర్థికసాయం



కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు చేరాల సిద్ధయ్య కుటుంబానికి పద్మశాలి సంఘం పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. చేనేత వృత్తి చేస్తూ మూడేళ్లుగా బ్యాంకులో దాచుకున్న రూ.40 వేలు ఇటీవల బ్యాంకు నుంచి డ్రా చేసుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని దుండగులు దొంగిలించిన విషయం తెలిసిందే. కష్టపడి దాచుకున్న సొమ్ము దొంగలపాలవడంతో మనస్థాపానికి గురైన సిద్ధయ్య బాధపడుతున్నాడన్న విషయం తెలుసుకున్న పద్మశాలి పట్టణ కమిటీ సభ్యులు సంఘం సహకారంతో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు శివశంకర్, పట్టణ శాఖ ప్రధానకార్యదర్శి రాజేందర్, రమేశ్, ప్రభాకర్, రాము, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రతీ ఇంటి ఆవరణలో మరుగుదొడ్డి ఉండాలి

- అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు



ఉప్పలపల్లిలో డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు

కమలాపూర్ : ప్రతీ ఇంటి ఆవరణలో తప్పనిసరిగా మరుగుదొడ్డి ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు సూచించారు. మండలంలోని అంబాల, ఉప్పలపల్లి, ఉప్పల్, గుండేడు తదితర గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఉపాధి హామీ పనులను, స్వచ్ఛభారత్ మిషన్ కింద చేపట్టిన పనులను తనిఖీ చేశారు. అంబాల ఎస్సీ హాస్టల్‌లో కమ్యూనిటీ ఇంకుడు గుంత నిర్మించాలని తక్షణమే ముగ్గు పోశారు. ఉప్పలపల్లిలో కంది సంపత్ అనే రైతు సాగు చేసిన డ్రాగన్‌ఫ్రూట్ తోటను పరిశీలించారు. ఆ తోటకు సంబంధించి ఉపాధి హామీ ద్వారా గాని, ఉద్యాన శాఖ ద్వారా గాని ఆ రైతుకు సహాయం చేయాలని సూచించారు. ఉప్పల్ గ్రామ పంచాయతీలో డిమాండ్ రికార్డులను పరిశీలించారు. మరుగుదొడ్డి లేని గృహాలను గుర్తించి వారికి స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా మంజూరు చేసి ఒక్కో మరుగుదొడ్డికి రూ.12 వేల చొప్పున చెల్లించాలని అన్నారు. ఈనెల 26వ తేదీ సాయంత్రంలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం గుండేడులో పేరబోయిన సంపత్ ఉపాధి హామీ నిధులతో నిర్మించుకున్న పశువుల షెడ్డును పరిశీలించారు. ఎంపీడీఓ బాబు, ఎంపీఓ రవి, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్, ఎస్‌బీఎం కన్సల్టెంట్ సంపత్, ఏపీఓ రమేశ్ పాల్గొన్నారు.

దేశం గర్వించే క్రీడాకారులుగా ఎదగాలి

- ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ

కమలాపూర్ : విద్యార్థినులు దేశం గర్వించదగిన క్రీడాకారులుగా ఎదగాలని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 23వ తేదీన ప్రారంభమైన ఎంజేపీ గురుకుల పాఠశాలల (అండర్-17 బాలికలు) ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థినులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువులో రాణిస్తూనే క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చాలన్నారు. కాగా ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో తిమ్మాపూర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రథమ, పెద్దాపూర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుని ఓవరాల్ చాంపియన్లుగా నిలిచినట్లు ఎంజేపీ గురుకులాల ఆర్‌సీఓ మోతె రాజ్‌కుమార్, డీసీఓ సరిత తెలిపారు. పి.పల్లవి (పెద్దాపూర్), సమన్విత (తిమ్మాపూర్) అత్యంత ప్రతిభ కనబర్చి వ్యక్తిగత చాంపియన్లుగా నిలిచినట్లు పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ సౌజన్య, రవీందర్, ఎస్సై వీరభద్రరావు, వివిధ ఎంజేపీ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, పీఈటీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి హామీ’ని వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఏపీఓ శారద

దామెర : ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని ఏపీఓ శారద అన్నారు. మండలంలోని ఊరుగొండ, కోగిల్వాయిలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 266 రకాల పనులు ఉపాధి హామీ పథకం ద్వారా అనుమతించినట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను గుర్తించబడిన పనులను కూలీల ద్వారా చేపించామన్నారు. గ్రామాలకు అవసరమైన పనులతో పాటు వివిధ పనులు కూడా చేసుకోవచ్చని వెల్లడించారు. ఈ సమావేశంలో టీఏలు సురేందర్, ప్రిసిల్లా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలకు అయోడిన్ అవసరం



అయోడిన్‌పై అవగాహన కల్పిస్తున్న సబ్ సెంటర్ వైద్యాధికారి అనూహ్య

నడికూడ : పిల్లల ఎదుగుదలకు అయోడిన్ అవసరమని స్థానిక సబ్ సెంటర్ వైద్యాధికారి డా.సిరికొండ అనూహ్య అన్నారు. మండల కేంద్రంలోని సబ్ సెంటర్‌లో శుక్రవారం అయోడిన్ లోపంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. థైరాయిడ్ గ్రంధి సరైన మోతాదులో హార్మోన్లను విడుదల చేయాలంటే అయోడిన్ అవసరమని అన్నారు. తగిన మోతాదులో అయోడిన్ అందకపోతే హైపోథైరాయిడ్‌కు దారితీస్తుందన్నారు. అయోడిన్ లోపం వలన ఎక్కువ సమస్యలు ఎదుర్కొనేది గర్భిణులు, పసిపిల్లలు అన్నారు. ముఖ్యంగా మెదడు పెరుగుదలకు అయోడిన్ అవసరమన్నారు. ఒక రోజుకు 100 మైక్రోగ్రామ్ సరిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ విద్యాసాగర్, ఆశ వర్కర్లు సునీత, శారద, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చేపపిల్లల పంపిణీ మత్స్యకారులకు వరం



చెరువులో చేపపిల్లలను విడుదల చేస్తున్న చైర్మన్, తదితరులు

వేలేరు : ప్రభుత్వం ఉచిత చేపపిల్లలను పంపిణీ చేయడం మత్స్యకారులకు వరమని ముదిరాజ్ సొసైటీ చైర్మన్ ఇట్టబోయిన సంపత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పెద్దచెరువులో ఏఈఓ రాజశేఖర్‌తో కలిసి చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో చేపపిల్లలను అందజేస్తుందని అన్నారు. మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. చేపల పెంపకంతో లాభాలు పొందాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు భూపతిరాజు, రమేశ్, శంకరయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి



మాట్లాడుతున్న భిక్షపతిమాదిగ

ధర్మసాగర్ : ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ మాదిగ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని అమలు చేయకుండా మాదిగ జాతిని వంచిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై మరో పోరాటానికి మాదిగ జాతి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈనెల 26న హనుమకొండలోని హంటర్‌రోడ్డు డీ కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల మాదిగ ధర్మయుద్ధం మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు మాదిగ బిడ్డలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎంఎస్‌పీ హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దినేశ్, శాంతిసాగర్, ప్రశాంత్, రాజు, బాబు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
వి. రాజ్‌కుమార్ యాదవ్ (S.R) : 9966290903 (ఎల్కతుర్తి)
ఎల్. రాకేష్ వర్మ (S.R) : 9885438059 (హన్మకొండ)
కె. సుధాకర్ (A.C.O) : 9177258410 (హన్మకొండ)